
నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 మహబూబ్‌నగర్, మంగళవారం 24 డిసెంబర్ 2024 MAHABUBNAGAR NARAYANPET

- మొత్తం రూ.195.81 కోట్లకుగానూ రూ.172.38 కోట్ల చెల్లింపులు
- పాలమూరు జిల్లా టార్గెట్ 1.99 లక్షల మెట్రిక్ టన్నులు
- సగం కూడా చేరని లక్ష్యం
- ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్న రైతులు



ధాన్యం తూకం వేస్తున్న సిబ్బంది



# ధాన్యం బకాయిలు రూ.23.43 కోట్లు

### చెల్లించాల్సింది.. రూ.23.43 కోట్లు

ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి సాగుచేసిన పంట చేతి కొచ్చాక కూడా అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. ధాన్యం కొను గోలు ప్రక్రియలో వివిధ నిబంధనలు, సాంకేతిక సమస్యలకు తోడు మిల్లర్ల తీరుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇవన్నీ చాలవన్నట్లు పంట సొమ్ము చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. దీంతో రైతన్నలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమచేస్తామని చెబుతున్న పాలక వర్గాలు వారం, పది, పక్షం రోజులు గడుస్తున్నా.. రైతుల ఖాతాల్లోకి ధాన్యం అమ్మిన డబ్బులు జమ చేయడం లేదని పలువురు వాపోతున్నారు. చెల్లింపుల్లో జాప్యం కారణంగా గతంలో తెచ్చిన అప్పులు తీర్చే పరిస్థితి లేక, వానకాలం పెట్టుబడి రాక అన్నదాతలు సతమతమవుతున్నారు. ఈ తరుణంలో పాత అప్పు తీరిస్తే తప్పా మళ్లీ పెట్టుబడి కోసం ఎవరూ డబ్బు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై రైతులకు సమాధానం చెప్పలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పంటలు ఎలా సాగు చేయాలని, పెట్టుబడికి డబ్బుల్లేక రైతులేమో ఆందోళన చెందుతున్నారు.

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబర్ 23 : మహబూబ్‌నగర్ జిల్లాలో రైతులు ధాన్యం విక్రయించేందుకు ప్రైవేటు వ్యాపారుల వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కంటే బయటి వ్యాపారులకే విక్రయిస్తున్నారు. జిల్లాలో 1,99,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 84,402 మెట్రిక్ టన్నుల ధాన్యం 17,514 మంది రైతుల నుంచి సేకరించారు. ఈ లెక్కన ధాన్యం సేకరణ కనీసం సగం లక్ష్యం కూడా చేరలేదంటే అతిశయోక్తి కాదు. ఈ నెల చివరి నాటికే లక్ష్యం వంద శాతం పూర్తి చేయాలని ప్రభుత్వం సూచిస్తున్నా.. ఇప్పటి వరకు కేవలం 40 శాతానికిపై మాత్రమే పూర్తయ్యింది. సేకరణ పూర్తయిన ధాన్యానికి సైతం రైతులకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించలేదు. సేకరణ చేసిన రైతులకు మొత్తం రూ.195.81 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 15,217 మంది రైతులకు రూ.172.38 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా 2300 మంది రైతులకు రూ.23.43 కోట్లు ఇవ్వాల్సి ఉన్నది.

### జిల్లాలో 177 కేంద్రాలు

ధాన్యం కొనుగోలు చేసేందుకు 177 కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వం తెరిచింది. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కేవలం 84,402 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. పాలమూరులో సన్న, దొడ్డు రకం ధాన్యం పండించగా రైతులు అధికంగా మధ్య దళారులు, వ్యవసాయ మార్కెట్లలో వ్యాపారులకు రైతులు ధాన్యాన్ని అమ్ముకున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు రకం ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.2,320 పలుకుతుండగా, బహిరంగ మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.2,800 వరకు కొనుగోలు చేయడంతో ఎక్కువ మంది రైతులు వ్యాపారుల వైపే మొగ్గుచూపుతున్నారు.



నిజాలాపూర్‌లో ధాన్యం సేకరిస్తున్న దృశ్యం

### రోజువారీగా చెల్లింపులు చేస్తున్నాం..

రైతుల సమగ్ర వివరాలు అందిస్తే మరింత వేగవంతంగా చెల్లింపులు జరుగుతాయి. 48 గంటల్లో అన్నమాట వాస్తవమే. రోజువారిగా చెల్లింపులు చేస్తున్నాం. రైతులు పీపీసీ సెంటర్లలో వ్యక్తికి సంబంధించిన వివరాలు అందించడం లేదు. వారు ఆలస్యం చేయడంతో సమగ్ర వివరాలు, ధ్రువీకరణకు ఇబ్బందులు అవుతుండటంతో 78 గంటల సమయం పడుతోంది. లక్ష్యం చేరలేదంటే రైతులు వారి ఇష్టప్రకారం ధాన్యం అమ్ముకుంటున్నారు. రైతులకు ఆరబెట్టడం, తూర్పారబట్టడం వంటివి చేసేందుకు ఓపిక లేదు.. వారికి త్వరగా కావాలి. అందుకే కళ్లాల్లోనే అమ్ముకుంటున్నారు. రైతులను ఇక్కడే అమ్మాలని మేం బలవంతం చేయలేం కదా.. రైతుల ఇష్టం.

**- ఇర్ఫాన్, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, మహబూబ్‌నగర్**

# పీవీ నర్సింహారావుకు ఘన నివాళి



పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, వాణీదేవి, ఎమ్మెల్యే విజయుడు తదితరులు

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 23 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతి పురస్కరించుకొని సోమవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ప్రాంగణంలో పీవీ చిత్రపటానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ కవిత తోపాటు ఎమ్మెల్యే విజయుడు నివాళులర్పించారు. అలాగే తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి విజయుడు కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. అలంపూర్ నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎందరో క్రీడాకారులు ఉన్నా సరైన క్రీడా ప్రాంగణాలు, సౌకర్యాలు లేక పోవడంతో క్రీడలకు దూరమయ్యే పరిస్థితి ఉన్నదన్నారు. వివిధ క్రీడా పోటీల్లో నియోజకవర్గ విద్యార్థి, విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని, సౌకర్యాలు కల్పిస్తే మరింత రాణిస్తారని విన్నవించారు. అలంపూర్ క్రీడాభివృద్ధికి తోడ్పాటునందించాలని, మండల కేంద్రానికి మినీ స్టేడియం నిర్మించాలని, స్పోర్ట్స్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఆయన తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# మర్రికి పరామర్శ

- నేడు రానున్న కేటీఆర్, హరీశ్‌రావు



మర్రి జనార్దన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి

తిమ్మాజిపేట, డిసెంబర్ 23 : తండ్రిని కోల్పోయిన నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని పలువురు పరామర్శించి సంతాపం తెలిపారు. నేరళ్లపల్లిలోని ఆయన ఇంటికి సోమవారం మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ చేరుకున్నారు. జంగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

***నేడు కేటీఆర్, హరీశ్‌రావు రాక..***

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని పరామర్శించేందుకు మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు వస్తున్నట్లు గులాబీ పార్టీ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు వారు నేరాళ్లపల్లికి చేరుకుంటారని, వారి వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు తరలిరానున్నట్లు తెలిపారు.

# స్ప్రింక్లర్ల పంపిణీలో గందరగోళం



బిజినేపల్లి రైతువేదిక వద్ద దూషించుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

బిజినేపల్లి, డిసెంబర్ 23 : మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు సబ్సిడీపై వచ్చిన స్ప్రింక్లర్ల పంపిణీలో గందరగోళం నెలకొన్నది. స్థానిక ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి సబ్సిడీపై వచ్చిన స్ప్రింక్లర్లను సోమవారం కొందరు రైతులకు అందజేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత గ్రామ, మండల కాంగ్రెస్ నాయకులు స్ప్రింక్లర్ల విషయంలో దూషించుకున్నారు. పార్టీ గెలుపుకోసం కృషి చేసిన గ్రామ స్థాయి కార్యకర్తలకు చెప్పకుండా ఇష్టానుసారంగా స్ప్రింక్లర్లను మంజూరు చేయడమేమిటని మండల స్థాయి కార్యకర్తలను నిలదీశారు. గ్రామంలోని కీలక నేతలకు తెలియకుండానే పేర్లను పిలిచి ఇష్టానుసారంగా ఎలా అందజేస్తారన్నారు. దీంతో అక్కడున్న కాంగ్రెస్ కార్యకర్తల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకున్నది. పెద్ద గ్రామాలకు సైతం స్ప్రింక్లర్లు రాకపోవడం, వచ్చినా గ్రామానికి ఒకటి, రెండు రావడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో అక్కడికి వచ్చిన రైతులు అసహనం వ్యక్తం చేశారు. స్ప్రింక్లర్ల విషయంలో మండల, గ్రామస్థాయి కార్యకర్తలే స్వయంగా ఒకరిపై ఒకరు దూషణలకు దిగడాన్ని చూసి వారు ముక్కున వేలేసుకున్నారు.

ఇంతలోనే గుడ్లనర్వ గ్రామానికి చెందిన రైతులకు రెండు సెట్ల స్ప్రింక్లర్లు గతంలో ఇవ్వాల్సి ఉన్నది. సోమవారం కూడా వారికి ఇవ్వకపోవడంతో వారు వేదిక వద్దే నిరీక్షించారు. తమకు అందించే వరకు వెళ్లమని భీష్మించుకూర్చోవడంతో స్పందించిన అధికారులు ఇతర ప్రాంతాల నుంచి రెండు సెట్లను తెప్పించి సదరు రైతులకు అందించడంతో వారు అక్కడి నుంచి వెనుతిరిగారు.

# సాగునీరు ఇవ్వాల్సిందే..

- యాసంగి పంటలకు లేవనడం ప్రభుత్వ అసమర్థతే..
- జూరాల ప్రాజెక్టు ద్వారా కొడంగల్‌కు నీళ్లివ్వడం అసాధ్యం
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును విస్మరించిన రేవంత్
- మంత్రిగా జూపల్లి మాట్లాడిన మాటలు మరిస్తే ఎలా..?
- మీడియాతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



వనపర్తిలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : యాసంగిలో పంటలు సాగు చేసిన రైతులకు సాగునీరు అందించాల్సిందేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. యాసంగి సీజన్‌లో వ్యవసాయానికి సాగునీళ్లు లేవని చెప్పడం పూర్తిగా ప్రభుత్వ అసమర్థతగా పేర్కొన్నారు. యాసంగికి ముందే ఇరిగేషన్ బోర్డు సమావేశం జిల్లా మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కానీ అలాంటి వాటికి తిలోదకాలు ఇస్తూ కేవలం ఒక డీఈ స్థాయి అధికారితో యాసంగిలో సాగునీరు ఇవ్వలేమని చెప్పించడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రికి, ఎమ్మెల్యేలకు రైతులపై ఎంత ప్రేమ ఉందో దీన్నిబట్టి అర్థమవుతోందన్నారు. రైతులకు నష్టం కలగకుండా పంటలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. యాసంగికి సాగునీటి సమస్య వచ్చేది కాదని, ఇప్పటికైనా పంటలకు నీటి ఢోకా రాకుండా అందించాలని కోరారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వివిధ ఎత్తిపోతల పథకాల పరిధిలో దాదాపు ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీరందించే జూరాల ప్రాజెక్టు ద్వారా కొడంగల్ ఎత్తిపోతలకు నీరు అందడం అసాధ్యమన్నారు. కేవలం పంథాలకు పోయి జూరాల ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతల ప్రతిపాదన చేస్తున్నారని, దీంతో భవిష్యత్‌లో అక్కడి రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. మరొకసారి ఈ ఎత్తిపోతలపై పునరాలోచించాలని మాజీ మంత్రి కోరారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా కేసీఆర్ ప్రభుత్వంలో కొనసాగిన జూపల్లి ఇటీవల సాగునీరివ్వలేదని మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన జూపల్లి తను అప్పట్లో మాట్లాడిన మాటలను మరిస్తే ఎలా అన్నారు. నాడు మంత్రిగా జొన్నలబొగుడ రిజర్వాయర్ ప్రారంభోత్సవంలో మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను నిరంజన్‌రెడ్డి మీడియాకు చూయించారు. అందులో.. 'గత పాలకులు కేఎల్ఐని పట్టించుకోలేదని, 1984 నుంచి 2004 వరకు కేవలం రూ.12 కోట్లు మాత్రమే ఖర్చు చేసి నిర్లక్ష్యం వహించారు'.. అని ఆ వీడియోలో మాట్లాడారు. అయితే, ఎక్కడ మంత్రిగా ఉంటే అక్కడి సీఎంకు భజన చేయడం అలవాటు చేసుకున్నట్లుగా ఆయన వ్యవహారం ఉందన్నారు. అప్పటి ప్రభుత్వం పని చేయకుంటే మంత్రిగా ఎందుకు కొనసాగారని, దాదాపు 20 ఏండ్లపాటు ఎమ్మెల్యేగా, మంత్రిగా అనుభవం ఉండి ఇంత నిస్సిగ్గుగా మాట్లాడటం తన విజ్ఞతకే వదిలివేస్తున్నామని చెప్పారు. ఎవరి హయాంలో ఎంత సాగునీరు ఇచ్చామన్నది ఇరిగేషన్ రికార్డులు చెబుతున్నాయని వివరించారు. ఎలాంటి అవగాహన లేకుండా సీఎం మెప్పు కోసం రాజీనామా చేస్తానంటూ మాట్లాడిన జూపల్లి తన పరువును తానే తీసుకున్నట్లుందని దుయ్యబట్టారు. సీనియర్ మంత్రిగా హుందాతనం ప్రదర్శించాలని, అసంబద్ధమైన వాఖ్యలను జూపల్లి ఉపసంహరించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాకు సాగునీటి రంగంలో జరుగుతున్న అన్యాయాలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ హోదాలో ఉన్న జూపల్లి, చిన్నారెడ్డిని చరిత్ర క్షమించదని, ఇందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

### పాలమూరును విస్మరించారు

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్ పాలకులు పూర్తిగా విస్మరించారని నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదిలో ఒక్కసారి కూడా సీఎంతో జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు ప్రాజెక్టు గురించి చర్చించలేదన్నారు. కేవలం పది శాతం మిగిలిన పనులను పూర్తి చేస్తే ఉమ్మడి జిల్లాలో అదనంగా 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందనున్నట్లు తెలిపారు. ఇక్కడి రిజర్వాయర్లు సిద్ధంగా ఉన్నాయని, కృష్ణానదికి వరద వచ్చిన సమయంలో నీటిని ఎత్తి పోసి నిల్వ చేస్తే సాగునీటి సమస్యలు ఉండవన్నారు. దాదాపు 70 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టు రిజర్వాయర్లను ఉపయోగించుకుంటే సమృద్ధిగా సాగునీటి అందుతుందన్నారు. నీరు సమృద్ధిగా ఉండాలంటే జూరాల, పాలమూరు ప్రాజెక్టుల అనుసంధానం జరగాలన్నారు. రైతుల ఉపయోగాలను విస్మరించి కేవలం పట్టుదలకు పోతే తీరని నష్టం జరుగుతుందన్నారు. అలాగే కేఎల్ఐలో అదనపు రిజర్వాయర్ల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అప్పుడే లెక్కలు వేసుకుని ప్రజలకు ఎందుకు చెప్పలేదని నిలదీశారు. మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారం చేపట్టాక అప్పులున్నాయని చెప్పడం మరింత మోసం చేయడం తప్పా మరోటి లేదన్నారు. రుణమాఫీలో సర్కారు గుర్తించిన జాబితాలోనే సగం మంది రైతులను పెండింగ్ పెట్టారన్నారు. గతంలో రూ.28 వేల కోట్లను బీఆర్ఎస్ ప్రభుత్వం మాఫీ చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా యదార్థం చెప్పండి.. వాస్తవాలను మాట్లాడండి.. లేకుంటే ప్రభుత్వం మరింత అభాసుపాలు కావడం ఖాయమన్నారు. సమావేశంలో లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, రమేశ్‌గౌడ్, కురుమూర్తి యాదవ్, మాణిక్యం, కృష్ణానాయక్, కరుణశ్రీ, అశోక్, చంద్రశేఖర్, జాత్రు నాయక్, విజయ్, మహేశ్వర్‌రెడ్డి, రాము, సునీల్ పాల్గొన్నారు.

# భర్తను గొడ్డలితో నరికి చంపిన భార్య



ముష్టి రాములు (ఫైల్)

లింగాల, డిసెంబర్ 23 : కట్టుకున్న భర్తను అత్యంత కిరాతకంగా హతమార్చిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. ఎస్సై నాగరాజు కథనం మేరకు.. లింగాల మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన ముష్టి రాములు (41), ఎల్లమ్మ దంపతులు. అయితే మద్యం తాగేందుకు బానిసై ఉన్న పది ఎకరాల్లో 9 ఎకరాలను విక్రయించాడు. ఈ విషయమై భార్యాభర్తలకు గొడవ జరిగేది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న దంపతుల మధ్య మరోసారి తగువు జరిగింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన భార్య ఎల్లమ్మ భర్త నిద్రిస్తున్న సమయంలో తలపై రోకలిబండతో మోదింది. అప్పటికీ మృతి చెందక పోవడంతో తర్వాత గొడ్డలితో నరికి చంపింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి, సీఐ రవీందర్ పర్యవేక్షణలో దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# చదువు చెప్పించని సర్కారెందుకు?

- నడింపల్లి కస్తూర్బా వద్ద తల్లిదండ్రుల ఆందోళన
- 15 రోజులుగా టీచర్లు సమ్మెలో ఉన్నారని ఆవేదన



సమస్యలను తల్లిదండ్రులకు చెబుతున్న విద్యార్థులు

అచ్చంపేట రూరల్, డిసెంబర్ 23 : పదిహేను రోజుల నుంచి తమ పిల్లలకు ఉపాధ్యాయులు చదువులు చెప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్కారు బడిలో అన్ని వసతులతో చదువులు చెబుతారని ఇక్కడ అడ్మిషన్ చేయిస్తే తమ పిల్లలకు చదువులు బంద్ పెట్టారని వాపోయారు. మండలంలోని నడింపల్లి కస్తూర్బా వద్ద ఆందోళన చేపట్టారు. విద్యార్థులను చూడడానికి వారి తల్లిదండ్రులు వెళితే వారి బాధలను కన్నవారికి వివరించారు. పదో తరగతికి వచ్చే నెలలో పరీక్షలు ఉన్నాయని, టీచర్లు రెండు వారాలుగా రావడం లేదని వాపోయారు. వారి జీతాల కోసం ధర్నాలు చేస్తున్నారని వివరించారు. దీంతో తమ పిల్లలకు చదువు చెప్పించని సర్కారు ఎందుకని వారు నిలదీశారు. ఇప్పటికైనా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి పిల్లలు చదువులు సజావుగా సాగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన విద్యార్థి సంఘాలు

# వనపర్తిలో విద్యార్థి సంఘాల ధర్నా

వనపర్తి టౌన్, డిసెంబర్ 23 : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బీఎస్ఎఫ్, బీజీవీఎస్, బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ముందుగా ధర్నా చౌక్ నుంచి ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో మూడేండ్లుగా విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.6,500 కోట్ల స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు నేటికీ విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌లు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచడంతోపాటు ప్రభుత్వం తక్షణమే విద్యా శాఖమంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం కేటాయించాలని అన్నారు. ఇంటర్, డిగ్రీ, బీటెక్ వంటి కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు డబ్బులు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకునే స్థోమత లేక.. ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌లో మంచి ర్యాంకులు సాధించి ఉన్నత విద్యలో అడ్మిషన్ పొందలేకపోతున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎమ్మెల్యే, మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ ఆదర్శ్ సురభికి అందజేశారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాము, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి అరవింద్ స్వామి, బీజీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముకుంద నాయుడు, బీసీ జిల్లా కార్యదర్శి చిట్యాల రాము, ఆసిఫ్, లోకేశ్, బీచుపల్లి, చెన్న కేశవ, బీఎస్ఎఫ్ నాయకులు రాజేశ్, శివ, సతీశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# విలీనం వద్దంటూ.. బలిజపల్లి వాసుల రాస్తారోకో

పెద్దమందడి, డిసెంబర్ 23 : మండలంలోని బలిజపల్లి గ్రామాన్ని జంగమాయిపల్లి గ్రామ పంచాయతీలో విలీనం చేయొద్దంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సోమవారం రోడ్డుపైకి చేరి బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జంట గ్రామాలైన జంగమాయిపల్లి-బలిజపల్లి గ్రామాలను వేరు చేసి రెండింటిని ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కొత్త పంచాయతీ ఏర్పాటుతో పల్లెలు అభివృద్ధి చెందాయని తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అధికారులు రెండు గ్రామ పంచాయతీలకు బదులు ఒక పంచాయతీ చేసేందుకు యత్నిస్తుండడంతో రెండు గ్రామాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నదని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రెండు గ్రామ పంచాయతీలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. దాదాపు 3 గంటల సేపు ఆందోళన కొనసాగగా పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు దారి మళ్లించి ట్రాఫిక్ నియంత్రణ చేశారు. ఈ విషయం తెలుసుకొన్న పోలీసులు, ఆర్డీవో అక్కడకు రావడంతో బలిజపల్లిని విలీనం చేయమని ప్రకటన చేసే వరకు ధర్నా విరమించేది లేదని తెగేసి చెప్పారు. దీంతో స్పందించిన ఆర్డీవో ఈ విషయాన్ని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపడుతున్న బలిజపల్లి గ్రామస్తులు